# జవరాలి మనసు

సాయంత్రం ఆరుగంటలవేళ. మెరీనాబీచ్ రకరకాల మనుష్యులతో నిండివుంది. తక్కిన గ్రూపులకు కొంచెము దూరంగా కూర్చున్నారు. శ్రీహరి, ఉషారాణి. ఉషారాణికి యిరవై ఏళ్ళుంటాయి. ఆమె ధరించిన లేత బంగారు నీడల చందేలీ చీర తెల్లని ఆమె దేహానికి విచిత్రమైన కాంతి నిచ్చింది. కాటుక నలు పెరుగని తేనెకళ్ళు తడిగా మెరుస్తున్నాయి. చీరపైనున్న జరీ చుక్కలు మిల మిల మంటున్నాయి. జడలోని జాజిపూలకు మగత పోతూ పోతూ వుంది. సుందరమైన ఆమె ముఖము మున్నితమైన దరహాసంతో వికసించి వుంది.

"మెరిసిపోతున్నావ్, పో!" అన్నాడు శ్రీహరి.

"ఎవరు?" అన్నది ఉషారాణి.

"నువ్వుకాక యింకెవరున్నా రిక్కడ?"

"నీవు లేవా మరి! పోనీలే, నేనే అంత బావున్నా నంటావు, సరే, నా నోటితో నేను కాదనటం దేనికి" అని చిలిపిగా నవ్వింది ఉష.

గాలికి ముఖాన్ని ముసురుకుంటున్న ముంగురులను సవరించుకుంటోంది ఉష.

"గెలవలేవు, గాలి నీ కన్న గడుసుది."

"అయితే నే గడుసు దాన్నంటావు - కానియ్."

చీర చివర్లు మెలిత్రిప్పుతోంది ఉష.

"ఖర్మ. నాకు చీరన్నాలేదు ఆడుకోటానికి."

"ఇంటిదగ్గరే చెప్తే, నీకూ ఒక చీర కట్టబెట్టేదాన్నిగా."

"నీ గడుసుదనం నీకు తెలియదంటే నమ్మను."

మధ్యాహ్నమంతా నిద్రపోయాను. ఇంకా మత్తుగానే వుంది మాటకు మాట తీర్చే ఓపిక లేదిప్పుడు, నువ్వేమన్నా ఒప్పుకుంటా నివ్వాళ."

"అన్నది ఒప్పుకుంటేకాదు, అడిగింది ఒప్పుకోవాలి."

"హూ, అబ్బాయికి ఆశ ఎక్కువే!"

"నా అంతు కనుక్కుంటున్నావు ఉషా, వూ అనవు, ఆ అనవు ఎన్నాళ్ళీ తెరమరుగులు? తేల్చి చెప్పగూడదూ."

"వూ, ఆ,—రెండూ అన్నాను యిక సరా!"

"ఇహ నీతో ఎలా మాట్లాడటం?"

"చీకటవుతోంది పోదాం" అంది ఉష మాట తప్పించి.

ఇద్దరూ లేచి యిసుక దులుపుకున్నారు, శ్రీహరి ముఖం ఎర్ర బడింది. ఉష కారెక్కి "నిలబడ్డావేం? రా" అంది.

"నువ్వెళ్ళు, నే వెళ్తాలే కాసేపుండి" అన్నాడు. శ్రీహరి.

"ఏమిటా కోపం?" అని అతని చెయ్యిపట్టి లాగింది కారులోకి. శ్రీహరి తెల్లబోయాడు. అప్పటికి కాని తానేమి చేసిందో ఉషకు తట్ట లేదు. సిగ్గు పడింది కాని ప్రకటించలేదు. శ్రీహరి ఆశలు చిగిర్చాయి. తన యింటిదగ్గర దిగిపోతూ "ఆలోచించుకో ఉషా, రేపయినా చెప్పవూ" అన్నాడు. మధురంగా నవ్వింది ఉషారాణి. కారు తిన్నగా సాగిపోయింది.

ఉష కారు దిగి మేడమీది కెళ్ళింది. తన గదిలోకి వెళ్తూ తనపేరు విన్న అలికిడికి హాల్లోనే నిలబడిపోయింది. డైనింగ్ హాల్ కర్టెన్ కొంచెం తొలగించి తొంగి చూసింది. ఆమె అన్న వాసుదేవరావు భోంచేస్తు న్నాడు. ఎదురుగా నున్న కుర్చీలో అతని భార్య కూర్చునుంది. అన్న ఏదో గట్టిగా మాట్లాడుతుండటం, మధ్యలో తనపేరు రావటం! అనుమాన మేసింది. ఉషకు. పొంచి వినాలనిపించింది.

"ఉష కిష్టమని నీకెలా తెలుసు" అన్నాడు వాసుదేవరావు.

"అయిష్టమయితే, అంత చనువు యివ్వదుకదా, అనుమానమేసి చెప్పాను. ఆలోచించవలసింది మీరు" అన్నది వాసు భార్య రాజేశ్వరి.

"నీ యిష్ట మేమిటి" అన్నాడు వాసు.

"నా యిష్టమేమిటి మధ్య; అందంగా వుంటాడు' తెలివైన వాడని మీరే అన్నారు. మర్యాద తెలిసిన వాడే, ఉష కిష్టమయితే నాకేమి లోటు కనిపించలేదు, డబ్బు దేముంది?"

"డబ్బుదేం లేదే? అయితే మీనాన్న నిన్ను నాకెందు కిచ్చా రంటావు"

"ఆ సంగతి నన్నడిగితే? నా పెళ్ళికి ముందు నాన్న నాకేమి చెప్పనూలేదు, నన్నేమీ అడగనూ లేదు."

"అడిగే వుంటే నన్ను చేసుకుని వుండేదానివి కాదేమో ఏం?"

"అబ్బ! ఎంత మాటపడితే అంత మాటనేస్తారు. అయినా ఏనాడో అయిందానికి యిప్పుడెందుకీ భాగోతం? మీ చెల్లెలి సంగతి చెప్పండి ముందు."

"అందంగా ఉంటే వున్నాడులే, ఆస్తంటూ లేనివాడికి నేే చస్తే యివ్వను" అన్నాడు వాసు.

"ఇవ్వడం యివ్వకపోవడం అంతా మీ యిష్టమేమిటి?" చిన్నగా నవ్వింది రాజేశ్వరి.

"లేకపోతే నాకు ఎదురు తిరుగుతుందంటావా, చూద్దాం" అన్నాడు వాసు.

ఉష యిక నిలవలేకపోయిం దక్కడ. గబగబ తన గదిలోకి వెళ్ళి గడియ పెట్టుకుంది. చెప్పులు విప్పలేదు. చీర మార్చలేదు. పక్క మీద ఒడిగిలింది. కోపంలో కందిపోయిం దామె ముఖం. అన్న తనమీద ఏదో అధికారం, అత్యాచారం సల్పుతున్నట్లు వూహించుకుని వణికి పోయింది. శ్రీహరి గుర్తుకొచ్చాడు. "ఆలోచించుకుని రేపయినా చెప్పు ఉషా!" అన్న మాటలే మళ్ళీ మళ్ళీ వినబడ్డాయి ఉషకు. శ్రీహరి అమాట ఆరు నెలలగా అంటున్నాడు. కాని తను లెక్కచెయ్యలేదు. శ్రీహరి అంతే

యిష్టంలేక కాదు. కొన్ని నిద్రపట్టని రాత్రులు, పనితోచని పవళ్ళు భవిష్యత్తు గురించి కలలు కనటంలో, మధురంగా ఊహించుకోటంలో గడపకపోతే, శ్రీహరి ప్రేమ దృక్కులకు పరవశమైపోయి "హరీ! నామీద నీకెంత దయ!" అని అనగల్గేదే కాని ఉషారాణి సంపదల్లో పుట్టి పెరిగిన పిల్ల. ఆమె వూహా లోకంలో రాబోయే విభుడూ, అతని కుటుంబము గురించి కలలకన్న, తనుండబోయే పెద్ద బంగళా, వస్తు వాహనాదులు, నిత్యమూ అతిథులూ, విందులూ, వాటిని గురించిన కలలే ఎక్కువ పొడుగైనవి. శ్రీహరిని భర్తగా స్వీకరిస్తే, ఆ కలలు నిజమవుతాయనే నమ్మకం తక్కువ. సంపదల సంగతి దూరం నెట్టితే, శ్రీహరి అంటే యిష్టమే ఉషకు. సంపదలను త్రోసిరాజని సామాన్యంగా జీవించాలంటే భయపడింది. అట్లాగని ఆమె హృదయానికి అప్రయత్నంగా లభించిన యీ ఆలంబనాన్ని గబుక్కున వదులుకోలేకపోయింది. అందుకే శ్రీహరికి ఏ జవాబు చెప్పటానికి ఆమె కిన్నాళ్లు తోచలేదు.

అప్పటి ఆమె హృదయ దౌర్బల్యం, తన అన్నను గురించి అపోహలు సమర్థించుకోటానికి పనికి వచ్చిందామెకు. అదే అన్న తన చెల్లెల్ని తల నిమురుతూ "ఆస్తి ఏమీలేదుగదా; కేవలం ఉద్యోగపు రాళ్ళతో మరి నిన్ను భరించగలడా! వేళకు పిలిస్తే గాని భోజనానికి రావు. పుస్తకాలు చదువుకుంటూ. రాగాలు తీసుకుంటూ, బొమ్మలు గీసుకుంటూ, సాయంత్రాల చల్లగాలికి తిరుగుతూ - యిలా అలవాటు పడ్డదానివి, రేపటినుంచి నీ చేతులలో నీవు పనులు చేసుకుని యిల్లు చక్కబెట్టుకుంటావో నేనెట్లా చూడగలను ఉషా!" అని అనివుంటే, తను తలఎత్తి అన్నవంక గర్వంగా చూడగలిగేది. "ఇంకా నాకు తట్టలేదన్నాయ్యా, నీ యిష్ట మొచ్చినట్లే కానియ్" అని కూడ అనగలిగేదేమో అకృత్రిమ ఆనందోద్రేకంలో కొట్టుకుపోతూ. కాని అతడు "నే ఛస్తే యివ్వను" అనేసరికల్లా వ్యవహారం బెడిసికొట్టింది. "ఛస్తే యివ్వడట. ఏమిటా అధికారం? నా పెళ్ళి కేవలం తన యిష్టంమీదనే జరిగి పోవ ...కి యిదేదో చెక్కు రాసివ్వటం అనుకున్నాడు కాబోలు! "ఎదురు

తిరుగుతుందేమిటి" అన్నాడు. నేను ఎదురు తిరగక పోవటంలో తన మంచితనం ఏమీలేదే హూ మగళ్ళంతా యింతే! వాళ్ళంటే ఎవరికైనా కాస్త అపేక్ష వున్నదని తెలిస్తే చాలు వాళ్ళమీద అధికారం చెలాయించటానికి కాస్తయినా సిగ్గుపడరు. అన్నయ్య ఎంత మంచివాడులా కన్పిస్తాడు. మాట్లాడనట్లే ఉండడు. మళ్ళీ ఆయనకు యింట్లో ఏ పని కావలసినా, అది జరగటానికి అర నిముషమైనా పట్టదు, వదిన మరీనూ; ఆమె కట్టుకునే చీర దగ్గరనుంచి "మీ అన్నయ్య కట్లాంటీవి నచ్చవు. అంటుంది. వాళ్ళకు మరీ అలుసు! ఏమిటో యీ మగళ్ళ మహారాజుతనం?" అలా అలా అలోచించి అలసిపోయింది ఉషారాణి. క్రమంగా ఆలోచనలు శ్రీహరివేపు మరలినవి. "ఎన్నడూ లేనిది యీ సాయంత్రమలా చేశానేమిటి? ఏమనుకుని ఉంటాడతను? కళ్ళల్లో ఎంత ప్రేమ ఒలికించినా మగవాడు. అతనే ఎప్పుడూ తన్ను తాకటానికి సాహసించలేదే, నేను చెయ్యిపట్టి కారులోకి లాగేనే! పోనీ—ఏమయ్యింది? రేపే చెప్పేస్తాను శ్రీహరికి "సరేనని" అన్నయ్య అధికారమేమిటో చూస్తాను. అట్లా అన్నగారిమీద కోపం శ్రీహరిమీద అదృష్టంగా జారి పడింది.

మరునాడు మధ్యాహ్నం మూడు గంటలకల్లా ఉష బైటకు వెళ్ళటానికి తయారైంది. హాల్లోకి వచ్చి కుర్చీ లాక్కుని కూర్చుంటూ రాజేశ్వరిని చూచి "వదినా ఎవరినైనా టీ పట్రమ్మని చెప్పండి" అన్నది.

"ఇంకా టిఫిన్ కాలేదు ఉషా, కాసేపు ఆగుతావా"

"నా కాకలిగాలేదు. వట్టి టీచాలు. తొందరగా తెమ్మనండి" అంది ఉష.

"ఎక్కడికన్నా వెళ్తున్నావా ఉషా" అనడిగింది రాజేశ్వరి.

"ఆ త్వరగా వెళ్లాలి."

ఉష శ్రీహరిని కలుసుకోటానికే వెళ్తున్నదని వూహించింది రాజేశ్వరి. ఆమెకు భయమేసింది.

"ఉషా, మీ అన్నయ్య కారు కావాలన్నారమ్మా యీ పూట" అన్నది ఉషను ఆపాలనే సంకల్పంతో. సాధారణంగా వాసుదేవరావు మరీ అర్జంటు పనివుంటే తప్ప సాయంత్రాలు కారు వాడుకోడు. సాయంత్రాలు కారు ఉషారాణి స్వాధీనంలోనే ఉంటుంది. ఆమె స్నేహితులతో షికారు కెళ్ళనీ, సినిమాల కెళ్ళనీ, క్లబ్బుల కెళ్ళనీ; అతడేమీ పట్టించుకునేవాడు కాదు. చదువుకున్నది ఆమాత్రం స్వేచ్ఛ యివ్వకపోతే వూపిరాడదు దానికి" అని నవ్వుతూ అనేవాడు భార్యతో. రాజేశ్వరి మాటతో ఉషకు ఒళ్లు మండిపోయింది. అక్కడున్న పనికుర్రాణ్ణి కేకేసి టాక్సీ పట్రమ్మ న్నది. రాజేశ్వరి తెల్లబోయి "అంత అవసరమా ఉషా" అన్నది. ఉష కోపం వట్టలేక "అన్నయ్య కారు కావాలన్నారు సరే, నేను టాక్సీ పిలి పించుకోకూడదని కూడా అన్నారా" అన్నది. రాజేశ్వరి నోట మాట రాలేదు. "నీకు కాదురా చెప్పింది టాక్సీ తీసుకు రమ్మని. అట్లా కళ్ళప్ప గించి నిలబడ్డావేం?" ఆకాశమే కాదు, అమ్మాయిలు కూడ ఉరమ గలరు.

టాక్సీ శ్రీహరి యింటిముందు ఆగింది. శ్రీహరి వాసుకు దూరపు బంధువు. మెడికల్ కాలేజీలో పనిచేస్తున్నాడు. ఉష టాక్సీ పంపించేసి తలుపు తట్టింది. శ్రీహరి యీజీచైర్‌లో పడుకుని ఏదో మెడికల్ జర్నల్ చూస్తున్నాడు. తలుపు చప్పుడు విని "లోపలికి రండి" అన్నాడు. లోపలికి వచ్చిన ఉషారాణిని చూచి విస్తుపోయాడు. "అరె, నువ్వా ఉషా, కూర్చో, కూర్చో వుండుండు ఆ కుర్చీనిండా దుమ్మే" అంటూ కంగారు పడ సాగాడు. "ఊరికే ఆర్భాటం చెయ్యకు, నేను కూర్చుంటాలే అని అక్క డున్న న్యూస్‌పేపర్‌తో కుర్చీ దులిపి కూర్చుంది. "నన్ను నాలుగింటికి మీ యింటికి రమ్మన్నావుగా, నువ్వే వచ్చావేం, ఇదివర కెప్పుడు తొంగి చూడనిదానివి" అన్నాడు శ్రీహరి. "నేను వస్తే యింత కంగారు పడి పోతావని తెలిస్తే చాలాసార్లే వచ్చివుందును" అంది ఉష నవ్వుతూ. శ్రీహరి లేచి ఫాన్ ఉషవైపు త్రిప్పి "కాఫీ త్రాగుదామా" అన్నాడు. "నాకు ఆకలిగా వుందని నీకెట్లా తెలిసింది?" అంది ఉష. శ్రీహరి

హృదయం సంతోషంతో తడిసిపోయింది. అలమారు తెరచి బిస్కట్ పాకెటు తెచ్చి బల్లమీదుంచాడు. స్విచ్ వేసి హీటర్ మీద పాలగిన్నె పెట్టాడు. మాట్లాడుకుంటూ యిద్దరు బిస్కట్లు తినసాగారు. ఉష గబుక్కున లేచి వెళ్ళి పాలు దించింది. అవి పొంగిపోటానికి సిద్ధమైనాయి. శ్రీహరి ఉష వంక అతిప్రేమగా చూచాడు. ఉష నవ్వింది. పాలు రెండు కప్పుల్లో పోసి కాఫీ కలిపింది. ఇద్దరు త్రాగారు. శ్రీహరి వక్కపొడి డబ్బా మూతతెరచి ఉష కందించాడు. ఉష కొంచెం తీసుకుంది. పొడవుగా అతి నాజూగ్గావున్న ఆమె వ్రేళ్ళవంక చూచాడతడు. గోళ్ళు కోలగా పెంచబడి రంగులేసి వున్నాయి. రాగరంజితాలైన ఆ గోళ్ళవంక చూచి ముగ్ధుడైనా డతడు.

"ఉషా" అన్నాడు తియ్యగా. అతని తన్మయత్వం కాంచిన ఉష "ఇంతటి అపేక్షను ఇన్ని రోజులెలా ఉపేక్షించగలిగాను?" అనుకుంది. ఒక నిముషం హరివంక చూచి తల దించుకుంది. "హరీ రేపు నువ్వు సెలవు పెట్టు. కొంచెం పనుంది ఒకచోటి కెళ్దాం!" అన్నది. శ్రీహరికి అర్థంకాలేదు.

"ఎక్కడికెళ్ళాలి; ఏం పని?" అన్నాడు. ఉషకు వెంటనే మాట పెగల్లేదు. అతనివంక చూడకుండానే "రిజిష్టరాఫీసుకు" అన్నది కరి వంగా. శ్రీహరి ఆశ్చర్యంగా "అసలు సంగతేమిటి ఉషా!" అన్నాడు. ఉషకు వెంటనే సమాధానం దొరక్క కాస్త చికాకుపడింది. "మరీ అంత అర్థంకాని ముఖం పెట్టకు హరీ, నా కసలే చిరాగ్గా వుంది.ఎందుకేముంది, ఇద్దరం వెళ్ళి డబ్బు కట్టివద్దాం. నీ స్నేహితు లెవరినైనా తీసుకునిరా మనకు తోడు" అన్నది. శ్రీహరి స్తబ్ధుడైనాడు. ఉష తనయందు చూపిన నిర్లక్ష్య మతడు మరచిపోలేదు. అందుచేతనే ఇప్పటి ఆమె సాహసానికి కారణం కేవలం తనమీది 'ప్రేమే' కాదని తేలికగానే వూహించాడు. కాని ఇన్నాళ్ళుగా అతని నిద్రా శాంతులను కబళించివేస్తున్న ఈ సమస్య ఇంత హఠాత్తుగా తీర నున్నందుకు అతడు సంతోషించకనూపోలేదు. ఆలోచనలు తెమల్చుకుని "అసలు సంగతేమిటి ఉషా!, మీ అన్నయ్య

నడిగితే ఒప్పుకో లేదా?" అన్నాడు. "ఆయన ఒప్పుకోటానికి, ఒప్పుకోక పోవటానికి నే నసలు చెప్పదల్చుకోలేదు" అంది ఉష. శ్రీహరి రెచ్చి పోయాడా మాట విని. "అసలు కారణం ఏమిటో నాకు తెలియటంలేదు. కాని ఏమైనా మీ అన్నయ్యకు కనీసం చెప్పకుండానైనా చేయటం కేవలం దుస్సాహసమేమో ఆలోచించు" అన్నాడు చివరకు.

స్వీయ రక్తంమీద కలిగిన అపోహ, ఆగ్రహం ఆమెను పూర్తిగా అబలను చేశాయి. పెంపొందించుకుంటున్న కోపం, అవ్యక్తమైన ఆవేశం ఆమెలో విజృంభించాయి. మెదడు పని చెయ్యటం మానేసింది. ఆ వలనుంచి బయటపడటానికి ఒక్కటే దారి. మంచిచెడ్డలు ఆలోచించకుండా ఎవరిమీదో ఒకరిమీద విరుచుకు పడటం! ఉష ఆ పనే చేసింది.

"ఏం! అన్నయ్యకు చెప్పకపోయినా, నాకు లేని బాధ నీకెందుకు? ఎదిరించినందువల్ల నీకేమీ కట్నం, కానుకలూ ఇచ్చి పంపడని భయపడుతున్నావా?" అన్నది.

శ్రీహరికి తేలు కుట్టినట్టయింది. అమాంతం ఉష గొంతు పట్టి నులిపి వెయ్యాలనిపించిందతనికి. పట్టరానికోసం, అసహనం పొంగి పొంగి రాగా, "ఉషా! పో! ఇక్కడనుంచి వెళ్ళిపో! ముందు!" అని అరిచాడు. ఉష బిత్తరపోయి చూచింది. శ్రీహరికి కోపం తగ్గలేదు. "నా ఇంటికివచ్చి. నన్ను అవమానించే అధికారం ఎవరిచ్చారు నీకు? నన్ను గురించి నీ కేదో గొప్ప అభిప్రాయమున్నదని నే నెప్పుడూ అనుకోలేదు. కాని నన్ను గురించి ఒకరోజున ఇంత హీనంగా వూహించగలవని మాత్రం అనుకోలేకపోయాను." కోపపు పొంగు కొంచెం తగ్గింది. "చదువు, సంపద, సౌందర్యం—అన్నీ మనిషికి శోభనిస్తాయి. ఎవరూ కాదనలేరు. కాని ఎవరుకూడ వాటి ఆసరాతో ఇతరులమీద దండెత్తడం కంటె దుస్సహాసం ఇంకోటిలేదు. వెళ్ళు ఉషా, వెళ్ళు, ఇంకెప్పుడూ నిద్రలో కూడ నా పేరు తలవకు. ఒక్కమాట. ఈ రోజు నాకు మంచి మంచిరోజో, చెడు రోజో చెప్పలేను కాని, నా జీవితంలో ఇది ఎన్నటికీ మర్చిపోని రోజు అవుతుంది. ఇంకా నిల్చున్నావు దేనికి ఉషారాణీ, ఈ

రోడ్డు చివరనే వుంది టాక్సీ స్టాండు" అన్నాడు. కోపపు పొంగులు
అణగారిపోగా, అరుపులు తగ్గి వ్యంగోక్తులు పలికాడు. శ్రీహరి మాటల
కెంత శక్తి? ఒక్కమాట! ఎంత తెచ్చి పెట్టింది? ఇప్పుడింత నిర్దాక్షి
ణ్యంగా ఇంటినుంచి వెళ్ళగొడుతున్నాడు ఉషను. కాని ఒక గంటకు
ముందు, ఆమె రాకతోనే అతని హృదయం ప్రఫుల్లమైంది.

ఉషకు తన తప్పు తెలుసుకోటానికి ఎక్కువ సేపు పట్టలేదు.
గాఢాతిగాఢమైన పశ్చాత్తాపముతో నిండిందామె హృదయం. "హరీ—తప్పు
చేశాను, చాల పెద్ద తప్పే చేశాను. క్షమించమని అడిగే సాహసంకూడ
నాకులేదు. అది నీ యిష్టం—క్షమించు, క్షమించకపో కానీ హరీ, నిన్ను
వేడుకుంటాను, నన్ను వెళ్ళగొట్టకు". ఆమె గొంతు గద్గదమైపోయింది.
ఒక్కసారి కళ్ళెత్తి శ్రీహరివంక చూచింది. అతడూ తనవంకే చూస్తు
న్నాడు. ఆ చూపులకు తట్టుకోలేక, సిగ్గు, పశ్చాత్తాపం పట్టలేక చేతులతో
ముఖం కప్పుకుని బిగ్గరగా ఏడ్చేసింది. శ్రీహరి తెల్లబోయాడు; నొచ్చు
కున్నాడు. ఆమెను సమీపించి, ఆమె చేతులు తొలగించి ముఖం
పైకెత్తాడు. "ఉషా, కళ్ళెత్తు, నా వంక చూడు, ఎందుకేడుస్తావ్?"
అన్నాడు జాలిగా. ఉష అతనిమీద ఒరిగిపోయి మరీ బిగ్గరగా ఏడ్చింది.
"అబ్బ! ఏంటిది ఉషా, లే, వూ వూరుకోవాలి మరి, ఇదుగో ఇట్లా
అయితే మళ్లా నాకు కోపం వస్తుంది తెలుసా" అని చిన్నగా నవ్వాడు.
రెప్ప అల్లార్చి కన్నీరు చెక్కిళ్ళపై జారుతుంటే ఉషకూడా నవ్వి, "కోపం
వస్తుందా? ఏదీ మళ్ళీ ఒక్కసారి కసురుకో నన్ను" అంది. శ్రీహరి
"మరి నువ్వంత మాట అనొచ్చా? కోపం పట్టలేక నేనూ అనేశాను.
నిజం! ఇంకెప్పుడూ కోప్పడను నిన్ను" అన్నాడు అనునయిస్తూ.

"ఉహూ, అట్లా వల్లకాదు, నా కప్పుడప్పుడూ కాస్త తిక్కపుట్టు
కొస్తుంటుంది. అప్పుడైనా నీవు కోప్పడాల్సిందే, లేకపోతే వూరుకోను,
హరీ—నీకో మాట చెప్పనా, కోపం వచ్చినపుడు నువ్వెంత బాగు
న్నావనీ!" అన్నది ఉషారాణి. శ్రీహరి ఆనందం పట్టలేకపోయాడు.
అందమైన ఆమె కనురెప్పల కొసను అంటిపెట్టుకుని వున్న అల్పమైన
నీటి బిందువును ఆదరంతో అందుకున్నాడు.

తన్మయత్వం నుంచి తేరుకున్న ఉషారాణి "రేపు నిజంగా రావాలిసుమా, కనిపెట్టుకుంటాను" అంది. "రా, నన్ను పంపించి వద్దువు గాని" అంది ఉష.

తలుపు తాళంవేసి ఇద్దరూ టాక్సీ స్టాండుకేసి నడిచారు. ఉష టాక్సీ తీసుకుని ఇంటికి వెళ్ళిపోయింది. శ్రీహరికి పరధ్యానం పట్టుకుంది చిర కాల వాంఛితం ఈడేరబోయే తరుణంలో సహజంగా కలగవలసినంత సంతోషం అతనికి లేకపోగా, గుండె బరువెక్కసాగింది. తన కర్తవ్య మేమిటో బోధపడలేదు. పోనీ ఉష కారణమైనా సరిగ్గా చెప్పిందా? వాళ్ళ అన్న ఇష్టపడకపోతే అది వేరే విషయం. అసలు చెప్పనక్కరలేదనటం ఏమి భావ్యం? ఉన్నట్లుండి ఇంత సాహసానికి తలపెట్టడమెందుకు? ఆలోచన తెమలక "ఆడవాళ్ళ అఘాయిత్యానికి ఇంతకంటే ఏం నిద ర్శనం కావాలి" అనుకున్నాడు.

ఇల్లు సమీపించిన తర్వాత, తటాలున ఏమనుకున్నాడో, వెను తిరిగి ఆ రోడ్డులోనే వున్న మెడికల్ షాపులోకి వెళ్ళి, అక్కడనుంచి వాసుదేవరావుకు ఫోన్ చేశాడు. వాసుదేవరావు శ్రీహరి చెప్పింది విని చాలా ఆశ్చర్యపోయాడు. "ఈ సాయంత్రం ఎక్కడికీ వెళ్ళవుగా, నే నక్కడకువచ్చి సావకాశంగా మాట్లాడుతాను" అన్నాడు. శ్రీహరి తెరిపిన పడ్డాడు.

ఆ సాయంత్రం వాసుదేవరావు శ్రీహరితో మాటల్లో, ఆ క్రిందటి రోజునే యీ విషయంలో తన అయిష్టం ప్రకటించినట్లు చెప్పాడు. శ్రీహరి ముఖం మారిపోయింది. చిన్నగా నవ్వుతూ "ఓ! అదా సంగతి" అన్నాడు. శ్రీహరి మాటల్లోని వ్యంగ్యాన్ని గుర్తించిన వాసు ఒక నిమిషం శ్రీహరి ముఖంకేసి చూసి ఇలా అన్నాడు. "చూడు శ్రీహరీ, మనసువిప్పి మాట్లాడుకుందాం! నా చెల్లెలు నిన్ను చేసుకోదల్చుకోటాన్ని నే నిష్టపడని మాట నిజమే! అందుకు కారణం, నలుగురిలో నిన్ను నా బావమరిదిగా చెప్పుకోటానికి నామోషి వేసికాదు. ఆ సంగతి గ్రహిస్తే నామీద నీకు కోపం రావటం అనవసరం. ఉష చిన్నప్పుడే మా అమ్మ

పోయింది. నాన్న మహ గారంగా పెంచారు. నాన్నకూడా పోయాక చాల
బెంగపడి పోయింది. అప్పట్లోనే వచ్చింది వాళ్ళ వదిన. ఆమె అంతకంటే
గారంచేసి దాన్ని పాడుచేసిందనే చెప్పాలి! ఈ మద్రాసులో ఉండటం,
కాలేజీకి పోవటం, ఈ రోజుల్లో ఆడపిల్లల సంగతి నేచెప్పాలా? మగ
పిల్లలకంటే వీళ్ళకే స్వంతఖర్చు లెక్కువై పోయాయి. ఉషకేమి అడ్డు?
డబ్బు ఖర్చుచేయటంలో పొందే తృప్తి ఇంకేవిధంగా పొందలేదు. రెండు
మూడు సార్లు చెప్పిచూద్దామనుకున్నాను. కాని ఆడపిల్లదేముంది—అసలు
విషయం అర్థం చేసుకోవటానికి ప్రయత్నించకుండానే అపోహలు పెంచు
కుంటారు. "నాన్నయితే యిలా అనేవారా, అన్నయ్యగనుక గాని!"
అని అనుకొనిపోతుందని వూరుకున్నాను. అటువంటి పిల్లను నీకిచ్చి
చెయ్యటానికి నాకు సాహసం తక్కువైంది. నిజమే! ఉషను నువ్వు
పువ్వుల్లో పెట్టి చూచుకుంటావని నాకు తెలుసు. కాని అలా సుఖపడటం
ఆమెకు చేతకావద్దూ! ఆ తర్వాత నిక్షేపంవంటి నీకు జీవితమంటే విసు
గెత్తిపోతుంది. ఉషసంగతంటావా, చేతిలో ధారాళంగా డబ్బు మెదలక
పోతే ఏదో "తగనివాణ్ణి" చేసుకున్నాననుకొని తాను చిరాకుపడి
నిన్ను చిరాకు పెట్టగలదు. చివరకు యిద్దరూ సుఖపడలేరు.
ఇంతకుతప్ప నీ విషయంలో నాకేమీ అభ్యంతరం లేదు. కాని
ఉష నిజంగా తనంత తాను నిన్ను చేసుకోవటానికి అంత పట్టు
దలగా వుందంటే నాకంటె సంతోషించేవాడుండడు. ఆమె బాగుపడుతోంది
అనటానికి ఇది మొదలవుతుంది. "ప్రేమ" మనిషిలో, లోపల్లోపలున్న
మంచిని వెలికిదీయగలిగితే. అంతకంటే కావలసిందేముంది?" అన్నాడు.
రెండు నిముషాలాగి "సరే, యిక వెళ్తా శ్రీహరి, వచ్చే నెలలోనే జరి
పిస్తాను. వివాహం;" అని నవ్వాడు.

శ్రీహరి మనసు తేలికపడింది. వాసునుచూసి కొంచెం సిగ్గుగా
"క్షమించండి, మీ గురించి యింకోలా భావించేను" అన్నాడు, వాసు
లేచినుంచుని శ్రీహరి భుజం తట్టుతూ "సరే, రేపు ప్రొద్దున అట్లారా,
ఉష రమ్మందంటివిగా; చిన్న నాటక మాడుదాం" అన్నాడు.

మరునాటి ఉదయం ఉషారాణి తనమంచంమీద పడుకుని ఎదురుగా గోడమీద పటంకేసి వూరికే చూస్తోంది. "ఛీ, ఏంపని చేశాను నేను" అని మాటిమాటికీ అనుకుంటోంది మనస్సులో. మొన్నరాత్రి అన్నమీద కల్గిన కోపాన్ని అంతగా పెంచుకొని నిన్న మధ్యాహ్నం అంత సాహస కార్యం చేసి వచ్చింది. ఏది ఏమైనా నిన్నటి సంఘటనతో యిక "శ్రీహరిని వదులుకోలేను" అనే తీర్మానానికి వచ్చింది ఉష. కాని ఈనాడు అతనితో కలిసివెళ్ళి రిజిస్ట్రారుముందు సంతకం చేసివచ్చే సాహసం కనపడటం లేదు. "శ్రీహరి వచ్చేస్తే, మళ్ళీ వెనక్కు తగ్గటం భావ్యం కాదు! పోనీ అంతపని చేసేస్తే! సాయంత్రమయితే వదినకు ఏమని చెప్పటం? అన్నయ్యముఖమెలా చూడటం? శ్రీహరి మర్చిపోయినా బాగుండును" మళ్ళీ కాసేపటికి "మర్చిపోవటమే—ఛ, ఛ, త్వరగా వస్తే బాగుండును" ఆమె ఆలోచన కంతులేకుండా వున్నది.

వోరగా వేసిఉన్న తలుపుతీసికుని గదిలోకి వచ్చాడు వాసు. అన్నను చూసి ఉష లేచికూర్చుంది. వాసు చెల్లెలి పక్కన కూర్చుని తల నిమురుతూ హఠాత్తుగా "అయితే ఉషా నువ్వు శ్రీహరిని చేసుకోవా లనుకోటం లేదా అమ్మా" అన్నాడు. ఉష ప్రశ్న విని తెల్లబోయింది. వ్యథతోకూడిన సిగ్గేదో ఆమెను ఆవరించింది. కళ్ళు దించుకునే "ఏం అన్నయ్యా, అట్లా అడుగుతున్నావ్" అంది "అదికాదమ్మా, ఇన్నాళ్ళనుంచి మీరు బాగా స్నేహంగా ఉంటున్నారా, నాకూ ముచ్చటేసి నిన్ను అతనికే యిద్దామనుకున్నాను. ఎప్పుడూ సాయంత్రాలు వచ్చేవాడు ఇవ్వాళ ఎందుకో ప్రొద్దుటే వచ్చాడు. చూసి ఉండబట్టలేక "ముహూర్తం పెట్టిస్తాను. యిష్టమేనా" అన్నాను. "అదేమిటి, నన్నెప్పుడో మీరడిగినట్లు, నేను ఒప్పుకున్నట్లూ ముహూర్తం పెట్టించమంటారా అంటారేమిటి? మీరేమీ పెట్టించనవసరం లేదు." అన్నాడు శ్రీహరి. ఏమీ అనలేక సంగతి సందర్భాలు నిన్నడుగుదామని లోపలికొచ్చాను" అన్నాడు వాసు. ఉషకు మతిపోయినట్లయి "మొన్న రాత్రి అట్లా మాట్లాడిన అన్న యింతలో యిట్లా మాట్లాడుతున్నాడేమిటీ? అయినా అన్నయ్య అడిగిన దానికి

శ్రీహరి అట్లా జవాబు చెప్పటమేమిటి? అబ్బబ్బ! అందరు మగవాళ్లూ ఒక్కలాంటివాళ్లే" ననుకుంది ఉష. ఉష మాట్లాడక పోవటం చూసి వాసు "ఉండు శ్రీహరినే పిలుద్దాం!" అని అక్కడున్న పని కుర్రాణ్ణి చూచి "క్రింద నాగదిలో డాక్టరుగారు కూర్చున్నారు. వారిని పైకి తీసుకురా" అన్నాడు. పైకివచ్చిన శ్రీహరిని చూచి "ఏమోయి, లోపలికిరా" అన్నాడు. శ్రీహరి అడుగులో అడుగువేసుకుంటూ గదిలోకి వచ్చాడు. అతన్ని ఎవరూ ఏమి అడగకముందే "ఉషా, నే వచ్చి గంట పైనైంది. "రెడీగా ఉంటాను రమ్మని" చెప్పావు, మరి కానీయ్ త్వరగా తయారుగా వెళ్దాం" అన్నాడు. ఉష లోపల్లోపలవణికిపోయింది. "ఏమిటో అరుపులు; అన్నయ్యదగ్గర నిన్నటి, సంగతంతా బైటపెట్టేస్తా డేమిటి ఖర్మ" అనుకుంది. వాసు "ఏం, ఉషా! అతన్ని రమ్మన్నావా నీవు? ఎందుకైనా మీ స్నేహం తగ్గించుకోటం మంచిది ఉషా! ఛీ. నే నింతవరకు ఎవరిదగ్గర బయట పడలేదు. నోరు తెరచి అడిగితే ముఖం మీదే చెప్పేశాడు. లేదని, కాదనీ" అన్నాడు. ఉష యింక తట్టుకోలేక పోయింది. కన్నీళ్ళు పొంగి వచ్చాయి. వాసు చెల్లెలి కళ్ళు తుడుస్తూ, "వెళ్ళు శ్రీహరీ! యింకెప్పుడూ ఉషకు కనిపించకు. ఇన్నాళ్లూ అంత చనువు చూపెట్టి యిప్పుడు చేసుకోనని చెప్పటం నీకుకాగా చెల్లింది వెళ్ళవయ్యా వెళ్ళు" అన్నాడు. "అదేమిటి వింతగా మాట్లాడుతున్నారు. మీ చెల్లెల్ని చేసుకోదల్చుకో లేదని నే నెప్పుడన్నాను" అన్నాడు శ్రీహరి.

"ఏమిటోయ్ తమాషాగా వుందే నీపని. ఇప్పుడు ముహూర్తం పెట్టించనా అంటే వద్దు పొమ్మన్నావు. మళ్ళీ ఇట్లా మాట్లాడుతున్నావేం?" అన్నాడు వాసు.

"బాగుందే! ఆ సంగతి మీ చెల్లెల్నే అడగండి. "పదిమంది మధ్య పందిట్లో గంటసేపు కూర్చోటం నా కసహ్యం. ఒక్క సంతకం పెట్టి వస్తే సరిపోయేదానికి ఎందుకొచ్చిన రభస" అన్నది. అందుకని ముహూర్తం పెట్టిస్తానంటే వద్దన్నాను" అన్నాడు శ్రీహరి.

ఉషకు వాసు, శ్రీహరి పందాలేసుకున్నట్లు అబద్దాల మీద అబ ద్దాలు ఎందుకాడుతున్నారో అంతు పట్టలేదు. ఏమైనా తను ఆ ఊబినుంచి బైటబడ్డందుకు మాత్రం మనసు తేలికయింది.

ఇంతలో రాజేశ్వరి ఉషకు దగ్గరగా వచ్చి, "ఏం ఉషా! పది మంది మధ్య నీకు సిగ్గని ఆలోచించావు తప్ప నన్ను గురించి ఆలో చించలేదే. ఊళ్ళో అందరూ మీ ఉషకు పెళ్ళెప్పెడు అని అడుగు తూంటే, వాయిదాలమీద వాయిదాలు వేస్తూ వచ్చాను. ఇంకానయం. అంత పని పూర్తయ్యాక చెప్పావుకావు! మంచిదానివే, యిన్నాళ్ళూ నీ వాడింది ఆటగా సాగనిచ్చాను కాని యీ విషయంలో నీ పెత్తనమేమీలేదు. ఏం శ్రీహరి! నీ వీలుకూడా ఆలోచించుకోని చెప్పు. వచ్చే నెలలోనే జరిపి వేస్తాం! యీ పిల్లతో ఇంకెన్నాళ్ళో వేగలేను నేను" అన్నది ఉష జుట్టు సవరిస్తూ. ఉష వదినకు మరింత దగ్గరగా జరిగింది. వాసు "అయితే నే వెళ్తా" నన్నాడు. శ్రీహరి "నాకూ టైమైంది" అన్నాడు. రాజేశ్వరి "సాయింత్రం వస్తావుగా శ్రీహరీ!" అని సాయంత్రందాకా కారు మి రుంచుకునేరు. ఉషకు కావలసి వుంటుంది. తొందరగానే పంపండి" అంది భర్తతో. మగవాళ్ళిద్దరూ వెళ్ళిపోగానే రాజేశ్వరి ఉషతో "ఏం ఉషా! సాయంత్రం బీచ్‌కెళ్తావా, సినిమాకెళ్తావా, మరిఏ౦చీర కట్టుకుంటావ్?" అన్నది.

"ఫో వదినా, అసలిదంతా నువ్వు చేసిందే!" అని అక్కడ ఒక క్షణం నిలవకుండా యింకోగదిలోకి పారిపోయింది ఉషారాణి.

—o—